ప్రజాశక్తి
ఆదివారం 3 నవంబర్ 2024
5
అనంతపురం

బాధిత రైతు పొలంలో పెత్తందారుడు తవ్విన నీటి గుంతను చూపుతున్న నాయకులు

పెత్తందారుల ఆగడాలను అరికట్టాలి

సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు జి ఓబులు

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

పేదరైతు భూమిని ఆక్రమించుకుని దౌర్జన్యం చేస్తున్న పెత్తందారుడు హీరేహాల్ మండలం గోడిసెలపల్లికి చెందిన గంధాల తార్నాథ్ రెడ్డి, ఆయన అనుచరులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు జి. ఓబులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయనతో పాటు సిపిఎం నాయకులు శనివారం డి. హీరేహాల్ మండలం గోడిసెలపల్లిలోని సర్వేనెంబర్ 241 - డి/2లో కబ్జాకు గురైన రైతు బండి అశోక్ కు సంబంధించిన భూమిని పరిశీలించారు. ఈ సందర్భంగా జి ఓబులు మాట్లాడుతూ బండి అశోక్ సర్వహక్కులు కలిగిన భూమిని గోడిసెలపల్లికి చెందిన గంధాల తార్నాథ్‌రెడ్డి, ఆయన అనుచరుడు బండి భీమిరెడ్డి అక్రమంగా ఆక్రమించుకున్నారన్నారు. గంధాల తార్నాథ్ రెడ్డికి ఉన్న పది ఎకరాల పొలానికి నీటిని సరఫరా చేసుకోవడం కోసం బండి అశోక్ కు సంబంధించిన 60 సెంట్లు భూమిలో నీటి కుంట ను అక్రమంగా దౌర్జన్యంగా త్రవ్వాలన్నారు. దౌర్జన్యాన్ని, అక్రమాన్ని సిపిఎం తీవ్రంగా ఖండిస్తోందని అన్నారు. రైతు అశోక్ తన పొలాన్ని సర్వే చేయాలంటూ రెండు సంవత్సరాల క్రితం స్థానిక తహశీల్దార్‌కార్యాలయంలో విన్నవించుకున్నారని ఈ విషయంపై సర్వే అధికారులు ఐదారు సార్లు సర్వే చేయడానికి వచ్చి తార్నాథ్‌రెడ్డి, బండి భీమిరెడ్డిల బెదిరింపులకు భయపడి వెనక్కువెళ్లారన్నారు. దీంతో బాధిత రైతు కలెక్టర్‌ను ఆశ్రయించగా ఆయన చొరవతో సర్వే అధికారులు స్పందించి అశోక్ పొలాన్ని సర్వే చేసి తార్నాథ్‌రెడ్డి, బండి భీమిరెడ్డి ఆక్రమించుకున్న భూమి బండి అశోక్ కు చెందినదేనని తేల్చి చెప్పారన్నారు. ఇది జరిగి సంవత్సరకాలమైనా బండి అశోకు సంబంధించిన భూమిని ఆయనకు అప్పచెప్పకుండా అధికారులు నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. ఆ భూమిని తిరిగి గంధాల తార్నాథ్ రెడ్డి స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారని అందుకు పోలీసుల, రెవెన్యూ అధికారులు వత్తాసు పలుకుతున్నారని విమర్శించారు. అందులో భాగంగానే గురువారం బాధితుడు అశోక్‌ను డి. హీరేహాల్ ఎస్ఐ పోలీస్ స్టేషన్ కు పిలిపించి బాధితుడిని బెదిరించారని అన్నారు. ఆక్రమణదారులు గంధాల తార్నాథ్ రెడ్డి, బండి భీమిరెడ్డికి వత్తాసు పలుకుతూ మాట్లాడారని విమర్శించారు. బాధితుడైన బండి అశోక్‌కు రక్షణ కల్పించాల్సిన ఎస్ఐ గంధాల తార్నాథ్‌రెడ్డి, బండి భీమిరెడ్డి మద్దతుగా వ్యవహరించడం సరైనది కాదని అన్నారు. ఈ విషయంలో ఎస్ఐ వ్యవహరించిన తీరును ఎస్పీ దృష్టికి తీసుకెళ్తామని ఓబులు చెప్పారు. తార్నాథ్‌రెడ్డి, భీమిరెడ్డి సంవత్సరాలుగా బండి అశోక్ భూమిని ఆక్రమించుకోవడం మాత్రమే కాకుండా తన పొలానికి అడ్డుకట్టగా వేసుకున్నారని, బండి అశోక్ కు చెందిన భూమిలో తవ్విన నీటికుంటను పూడ్చాల్సిన బాధ్యత గంధాల తార్నాథ్‌రెడ్డిదే అని అన్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి బాధితుడైన బండి అశోక్ భూమిని ఆయనకు అప్పగించాలని ఆక్రమణదారులు గంధాల తార్నాథ్‌రెడ్డి, బండి భీమిరెడ్డిపై తక్షణం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధితుడికి న్యాయం జరగకపోతే సిపిఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి మల్లికార్జున, మండల కార్యదర్శి ఎన్ లోకేష్, రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు మల్లికార్జున, రాయదుర్గం ప్రాంతీయ కమిటీ సభ్యులు మధు, తిమ్మరాజు, నాయకులు రుద్రముని, డి అశోక్, రామలింగ, శ్రీరామ్ రెడ్డి వాటర్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి రాము తదితరులు పాల్గొన్నారు.

మూడొంతుల చెరువులు ఖాళీనే..!

వానలొచ్చినా చెరువుల్లోకి చేరని నీరు
కాలువల నిర్వహణ లోపమే కారణం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది వర్షాలు బాగా పడ్డాయి. సాధారణం కంటే అధికంగానే రెండు దొట్ల వానలు పడ్డాయి. అయితే ఇప్పటికీ చెరువులు మాత్రం మూడొంతులు ఖాళీగానే ఉన్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1484 చెరువులున్నాయి. ఇందులో అనంతపురం జిల్లా పరిధిలో 304 చెరువులుండగా, సత్యసాయి జిల్లా పరిధిలో 1180 చెరువులున్నాయి. వీటిల్లో 48 చెరువులు మాత్రమే పూర్తి సామర్థ్యంతో నిండాయి. ఇందులో అనంతపురం జిల్లాలో 36 చెరువులు, సత్యసాయి జిల్లాలో 12 చెరువులు పూర్తి సామర్థ్యంతో నిండాయి. అంటే రెండు జిల్లాల పరిధిలోనూ కలిపి 48 చెరువులే పూర్తి సామర్థ్యంతో నిండాయి. తక్కిన వాటిల్లో అరకొరగా నీరు ఉన్నాయి. ఇంకా 968 చెరువుల్లో చుక్క నీరు లేదు. అంటే 65 శాతం చెరువులు ఖాళీగా ఉన్నాయి. అనంతపురం జిల్లాలో 171 చెరువులు ఖాళీగా ఉండగా, సత్యసాయి జిల్లాలో 798 చెరువులు ఖాళీగానున్నాయి.

వానలొచ్చినా...వరదలొచ్చినా నిండని చెరువులు

ఈ ఏడాది అత్యధికంగా వర్షపాతం ఉమ్మడి జిల్లాలో నమోదయింది. సాధారణం కంటే అధికంగా వర్షాలు పడ్డాయి. అయినా చెరువులకు నీరు మాత్రం రాలేదు.అదే విధంగా ప్రధాన ప్రాజెక్టులైన తుంగభద్ర డ్యామ్, శ్రీశైలం డ్యామ్‌కు అధిక వరద వచ్చింది. దీంతో అటు తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ, ఇటు హంద్రీనీవా ద్వారా కూడా అధికంగా నీరు తీసుకునే అవకాశం కలిగింది. కాని ఈ కాలువ నిర్వహణ సరిగా లేని కారణంగా వరదలొచ్చినా నీటిని అదనంగా తీసుకోలేకపోవడంతో చెరువులను నింపుకోలేని పరిస్థితి నెలకొంది. ఈ ఏడాది చూస్తే అనంతపురం జిల్లాలో ఇప్పటి వరకు సాధారణ వర్షపాతం 414.5 మిల్లీమీటర్లు కురవాల్సి ఉండగా 565.5 మిల్లీమీటర్లు నమోదయింది. సాధారణం కంటే 36.4 శాతం అదనంగా పడింది. సత్యసాయి జిల్లాలో సాధారణ వర్షపాతం 462 మిల్లీమీటర్లకుగాను 710.8 మిల్లీమీటర్లు పడింది. సాధారణం కంటే ఇక్కడ 53.8 శాతం అధికంగా పడింది. ఈ జిల్లాలోనే అత్యధికంగా చెరువులు కూడా ఉన్నాయి. కాని చెరువులు మాత్రం అత్యధికం ఖాళీగానే ఉండటం గమనార్హం.

నిర్వహణ లోపాలతో నష్టం

చిన్న నీటిపారుదలపై ప్రభుత్వాలు ఏ మాత్రం దృష్టి సారించకపోవడంతో చెరువుల కనీస నిర్వహణకు నోచుకోవడం లేదు. ఎపిఎల్‌ఎపి ఎపిఐఎటిపి, నాబార్డు తదితర పథకాల కింద కొన్ని పనులు మంజూరైన బిల్లులు రావన్న ఉద్దేశ్యంతో పనులు నిలిపివేయిన్నారు. సుమారు 51 పనులు చేపడితే అందులో మూడు మాత్రమే ప్రగతిలో ఉన్నాయి. పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు మధ్యలోనే ఆపేశారు. ఇక ఇతర చెరువులకు మరమ్మతులు చేపట్టే పరిస్థితి లేక నీరొస్తున్నా ఒడిసి పట్టుకుని నిలుపుకోలేక వృథాగాపోతున్నాయి. దీంతో చెరువుల్లో నీరు నింపుకునే అవకాశమున్నా నిర్వహణ లోపాలతో వృథాగా పోతున్నాయి.

'ఉపాధి'లో అవినీతి సొమ్మును రికవరీ చేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చోటు చేసుకున్న అవినీతి సొమ్మును రికవరీ చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గతేడాది జిల్లాలో జరిగిన ఉపాధి హామీ పనుల తనిఖీలో పెద్దఎత్తున అక్రమాలు జరిగినట్లు వెలుగు చూసిన విషయం తెలిసిందే అన్నారు. ఉపాధి నిధుల్లో అవినీతికి పాల్పడిన రాజకీయ నాయకులు, సహకరించిన అధికారులపై క్రిమినల్ కేసులు పెట్టి, పూర్తిసొమ్మును రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో వ్యవసాయ పనులు తగ్గిపోయి పూట గడవక పస్తులతో వ్యవసాయ కూలీలు ఉంటే వారికి చెందాల్సిన డబ్బును కొల్లగొట్టడం దారుణమన్నారు. నాయకుల అవినీతికి ఇసుక, మట్టి, భూములు సరిపోక వ్యవసాయ కూలీలకు చెందాల్సిన డబ్బును మింగేసిన దొంగల పట్ల అన్ని పార్టీలు స్పందించాలన్నారు. జిల్లాలో ఇప్పటి వరకూ జరిగిన సామాజిక తనిఖీల్లో రూ.5.38కోట్లు పక్కదారి పట్టినట్లు గుర్తించి కేవలం రూ.34 లక్షల రికవరీకి ఆదేశించడం ఏంటని ప్రశ్నించారు. ఒకవైపు కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకానికి నిధులు కోత కోసి ఒకవైపు నిర్వీర్యం చేస్తుంటే, మరోవైపు అవినీతిపరులు రూ.కోట్లు కాజేస్తున్నారన్నారు. రాజకీయం చాటున ఇష్టారాజ్యంగా ఉపాధి హామీ పనులను పక్కదారి పట్టించి ఈ పథకం స్ఫూర్తిని దెబ్బతీసిన దొంగలను ఎక్కడికక్కడ నిలదీయాలన్నారు. ఇలాంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి అవినీతికి పాల్పడిన సొమ్ము మొత్తాన్ని రికవరీ చేయాలని డిమాండ్ చేశారు.

టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడుకు బొకే అందజేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

టిటిడి ఛైర్మన్ బిఆర్‌ను కలిసిన ఎమ్మెల్యేలు

అనంతపురం రూరల్ : ఇటీవల టిటిడి ఛైర్మన్‌గా నియమితులైన బిఆర్.నాయుడును ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు దగ్గుపాటి ప్రసాద్, ఎంఎస్.రాజు శనివారం హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఇందులో భాగంగా బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే టిటిడి పాలక మండలి సభ్యుడిగా నియమితులైన ఎమ్మెల్యే ఎంఎస్ రాజుకు దగ్గుపాటి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి రాయల్ మురళి, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటప్ప, టిడిపి నాయకుల కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కార్మికులకు నాణ్యమైన వైద్యం

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కార్మికుడితో మాట్లాడుతున్న కలెక్టర్

పరిశ్రమలో తప్పులు జరిగుంటే చర్యలు
కలెక్టర్ వినోద్ కుమార్

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

శింగనమల మండల పరిధిలోని లోలూరు గ్రామం వద్దనున్న సప్తగిరి క్యాంపర్ పరిశ్రమలో ప్రమాదం జరిగి అస్వస్థత గురైన కార్మికులకు నాణ్యమైన వైద్యచికిత్సలు అందిస్తున్నామని కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. అనంతపురం నగరంలోని కిమ్స్ సవేరా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధిత కార్మికులు అనంతపురం సాయి నగర్ కు చెందిన నాగేంద్ర ప్రసాద్, కృష్ణ, లక్ష్మీనారాయణ, సారయ్య, హరినాథ్ బాబును కలెక్టర్ శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు ఎలాంటి భయపడాల్సిన అవసరం లేదని, చికిత్స గురించి ఎలాంటి ఆందోళన వద్దని చెప్పారు. యాజమాన్యం, ప్రభుత్వం నుంచి చికిత్సకు అయ్యే ఖర్చు భరించి ఉత్తమ చికిత్స అందిస్తామన్నారు. మొత్తం చికిత్స పూర్తయ్యే వరకు ఆస్పత్రిలోనే ఉండాలని, ఖర్చు గురించి ఎలాంటి ఆలోచన వద్దని వారికి ధైర్యం చెప్పారు. అనంతరం బాధిత కార్మికుల కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి భరోసా కల్పించారు. బాధితులకు ఏ అవయవం నష్టపోకుండా చర్యలు తీసుకున్నామన్నారు. ప్రతి రోజు ఉదయం 10గంటలు, సాయంత్రం 4:30 గంటలకు కుటుంబ సభ్యులకు బాధితుల వివరాలు అందించాలని డాక్టర్లకు సూచించారు. ఎలాంటి సమస్యలున్నా శింగనమల తహశీల్దార్ ఫోన్ నెంబర్ 9493188823 కు ఫోన్ చేయవచ్చని బాధితులకు చెప్పారు. ఎలాంటి సమస్యలున్నా పరిష్కరించాలని తహశీల్దార్‌ను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం కలెక్టర్ స్థానిక విలేకరులతో మాట్లాడారు. సప్తగిరి క్యాంపర్ పరిశ్రమలో శుక్రవారం ఉదయం 9 గంటలకు 12 అడుగుల లోతులో ఉన్న ఒక రియాక్టర్ లో వెల్డింగ్ పనులు చేసేందుకు ఇద్దరు కిందకి దిగారన్నారు. వారు వెనక్కి రాలేదని తనిఖీ చేసేందుకు ఇంకా ఇద్దరు కిందికి వెళ్లారని, వారిని తనిఖీ చేసేందుకు మరో ఇద్దరు దిగారన్నారు. మొత్తం ఆరుగురు రాకపోయేసరికి తొమ్మిది నలభైఐదుకి చివరగా వెళ్లిన అతను వారిని బయటకు తీసుకువచ్చారన్నారు. అందులో ఇద్దరు అపస్మారక స్థితికి చేరుకున్నారని, మిగతావారికి ఊపిరితిత్తుల సమస్య వచ్చిందని అన్నారు. వెంటనే సప్తగిరి క్యాంపర్ యాజమాన్యం వారు దాదాపు 10:15 గంటలకు అనంతపురంలోని కిమ్స్ సవేరా ఆస్పత్రికి ఆరుగురిని తీసుకువచ్చారని చెప్పారు. ఆ ఆరుగురిలో ఒకరు మధ్యాహ్నానికి డిశ్చార్జ్ అయ్యారని చెప్పారు. ప్రస్తుతం నాగేంద్ర ప్రసాద్, కృష్ణ, లక్ష్మీనారాయణ, సారయ్య, హరినాథ్ బాబు సవేరా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారన్నారు. అందులో ఇద్దరు ఐసీయూలో ఉంటే, మరో ముగ్గురిని సాధారణ వార్డులో చికిత్స పొందుతున్నారని చెప్పారు. ప్రస్తుతానికి ఎవరికీ కూడా ప్రాణహాని లేదని తెలిపారు. జరిగిన ఘటనపై అధికారులు విచారణ చేసి నివేదిక అందిస్తారని, అందులో తప్పులు కనబడితే చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వసంతబాబు, డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్. సుజాత, జిల్లా ఫైర్ అధికారి శ్రీనివాసరెడ్డి, తహశీల్దార్లు బ్రహ్మయ్య, హరికుమార్, పరిశ్రమల శాఖ జిఎం శ్రీధర్, ఫ్యాక్టరీస్ డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ కేశవులు, కిమ్స్ సవేరా సూపరింటెండెంట్ హాబీబ్ రాజా, క్రిటికల్ కేర్ డాక్టర్లు రవిశంకర్, చంద్రశేఖర్, సీఈవో పీఎస్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

జెండా ఊపి గుంతలు పూడ్చే పనులను ప్రారంభిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

గుంతలు లేని రహదారులే లక్ష్యం

ప్రజాశక్తి - ఉరవకొండ

జిల్లాలో ఆర్అండ్‌బి రహదారులను గుంతలు లేని రహదారులుగా తీర్చిదిద్దుతామని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ పేర్కొన్నారు.శనివారం విడపనకల్లు మండలం ఆర్.కొట్టాల గ్రామం వద్ద విడపనకల్లు నుంచి గడేకల్లుకు వెళ్లే రోడ్డుకు సంబంధించి గుంతలు లేని రోడ్ నెట్ వర్క్ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు.ఈకార్యక్రమానికి భూమి పూజ చేసి.. పచ్చజెండా ఊపి పనులను ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గుంతలు లేని రహదారుల క్యాంపెయిన్ విడపనకల్లు మండలంలో ప్రారంభించామన్నారు. జిల్లాలో 8 నియోజకవర్గాలలో కూడా స్థానిక శాసనసభ్యులు, అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొని పనులు మొదలు పెట్టారన్నారు. జిల్లాలో మొత్తం 68 పనులకు 19.7 కోట్ల రూపాయలు మొదటి విడతగా మంజూరయ్యాయని చెప్పారు. రాబోయే రోజుల్లో ఇంకా ఈ పనులకు సంబంధించి మంజూరులు వస్తాయన్నారు. జనవరి 15వ తేదీలోపు యుద్ధ ప్రాతిపదికన పనుల పూర్తికి చర్యలు తీసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గుంతకల్లు ఆర్డీవో ఎబివిఎస్‌బి శ్రీనివాస్, ఎంపీపీ కరణం పుష్పావతి భీమ్ రెడ్డి, జెడ్పిటిసి హనుమంతు, టీడీపీ మండల కన్వీనర్ జి.మారయ్య, ఆర్అండ్‌బి ఎస్ఇ హరిప్రసాద్, ఇఇ రాజగోపాల్, మండల ప్రత్యేక అధికారి వెంకటస్వామి, తహశీల్దార్ సునీతబాయి, ఎంపీడీవో షకీలాబేగం, మండల నాయకులు బోయ హనుమంతు, భీమలింగ, రామాంజనేయులు, సర్పంచులు చంద్రశేఖర్, తిమ్మరాజు, తిప్పారెడ్డి, ఆశాలత, జయసింహ, జనార్ధన్, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ ఆఫీసర్‌పై చర్యలు తీసుకోవాలి

ముస్సిపల్ కార్యాలయంలో కార్మికులు, నాయకుల అర్ధనగ్న ప్రదర్శన

సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికుల నిరసన

ప్రజాశక్తి - అనంతపురం కార్పొరేషన్

సంవత్సరాలు గడుస్తున్న కార్మికుల సమస్యల పరిష్కారం చేయకపోగా కార్మిక సంఘాల మధ్య చిచ్చు పెడుతున్న మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ విష్ణుమూర్తి వైఖరికి నిరసనగా సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం నాయకులు, కార్మికులు శనివారం ఆందోళనకు దిగారు. సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు భిక్షాటన చేసే అర్ధ నగ్న ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు ఒకటవ నగర ప్రధాన కార్యదర్శి వై. వెంకటనారాయణ, మున్సిపల్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కే. నాగభూషణ జిల్లా అధ్యక్షులు ఎటిఎం. నాగరాజు మాట్లాడుతూ కార్మిక సమస్యల పరిష్కారం పట్ల నిర్లక్ష్య వైఖరి వహిస్తున్న హెల్త్ ఆఫీసర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికులకు వేతనాలు రాయకుండా ఇబ్బంది పెడుతున్న కంప్యూటర్ ఆపరేటర్ హర్షవర్ధన్‌కు మద్దతు పలుకుతూ ఉన్నతాధికారుల ఆదేశాలను ధిక్కరిస్తూ హెల్త్ ఆఫీసర్ వ్యవహరిస్తున్న తీరును ఎండగట్టారు. 2020 సంవత్సరం నుండి ప్రతి నెల ఏదో ఒక సాంకేతిక కారణాల నెపంతో నగరపాలక సంస్థలో విధులు నిర్వహిస్తున్న అవుట్‌సోర్సింగ్ కార్మికుల వేతనాలలో కోతలు విధిస్తున్నారన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అదేవిధంగా ఎన్ఎంఆర్, అదనపు కార్మికులైన క్లాప్ ఆటో కార్మికులతో గత మూడు నెలలుగా పనులు చేయించుకుని వేతనాలు ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. అధికారుల వైఖరివల్ల పండుగ పూట కూడా కార్మికులు, వారి కుటుంబసభ్యులు పస్తులు ఉండే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. అన్నదమ్ములుగా ఉన్న కార్మికుల మధ్య మంటలు రాజేస్తున్నారన్నారు. కార్మికుల సమస్యల పట్ల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే దశలవారీగా ఆందోళన పోరాటాలు చేపట్టి, మెరుపు సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. ఈసందర్భంగా బకాయి వేతనాలు ఇవ్వాలని కార్మికులతో కలిసి కుండ, మూకట్లతో మున్సిపల్ కార్యాలయం, బయట షాపుల వద్ద భిక్షాటన చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రెండవ నగర అధ్యక్షులు యం.గురురాజా, మున్సిపల్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు ఎస్. లక్ష్మీనారాయణ, జిల్లా కోశాధికారి ఆదినారాయణ, నగర అధ్యక్ష కార్యదర్శులు ఎర్రిస్వామి, తిరుమలేశు, ఉపాధ్యక్షులు యం.శేషేంద్ర కుమార్, నగర కోశాధికారి యం.లక్ష్మీనరసమ్మ, నగర మహిళా కన్వీనర్ వరలక్ష్మి, కమిటీ సభ్యులు శ్రీనివాసమూర్తి, కుళ్లాయప్ప, శీనా, చలపతి, నాగేంద్ర, మంజుల, రాఘవేంద్ర ప్రసాద్, నల్లప్ప, పెన్నోబులేసు, యం.ఎర్రిస్వామి, రవి,కుమార్, ప్రభాకర్, నారాయణస్వామి, శంకర్, రెగ్యులర్ యూనియన్ నగర కార్యదర్శి ఎల్. ముత్తరాజు, కోశాధికారి నారాయణస్వామి కమిటీ సభ్యులు ఆనంద్, కోవిడ్, మలేరియా, గార్బేజ్, కార్మికులు పాల్గొన్నారు.

జైలు నుంచి విడుదలైన విఒఎలకు సిఐటియు స్వాగతం

ప్రజాశక్తి అనంతపురం కలెక్టరేట్



జైలు నుంచి విడుదలైన విఒఎలకు స్వాగతం పలుకుతున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు

9 రోజులపాటు బుక్కరాయసముద్రం మండలం రెడ్డిపల్లి జైలులో రిమాండ్‌లో ఉండి శనివారం విడుదలైన విఒఎలకు సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జైలు నుంచి విడుదలైన ఉమ్మడి అనంతపురం జిల్లా విఒఎల సంఘం నాయకులు రాజు, బి.తిప్పేహనుమ, హనుమంతురాయుడు, టి.రామనాయక్‌కు పూలమాలలు వేసి స్వాగతించారు. స్వాగతం పలికిన వారిలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వెంకటనారాయణ, తిరుమలేష్, ఎర్రిస్వామి, తదితరులు ఉన్నారు.

సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలి

గుత్తి : సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలని ఎంపిడిఒ ప్రభాకర్‌నాయక్ సూచించారు. శనివారం మండలంలోని ఉబిచెర్ల సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా రికార్డులు, హాజరు పట్టిక పరిశీలించారు. ఒకటో తేదీన సామాజిక పింఛన్లను ఆలస్యంగా పంపిణీ చేసిన సచివాల ఉద్యోగులకు ఆయన మెమోలను జారీ చేశారు. కార్యక్రమంలో ఈఓఆర్డి శివాజీ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సాదిక్ వలి తదితరులు పాల్గొన్నారు.

పులివెందుల ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్‌గా డి.విష్ణువర్ధన్

అనంతపురం : అనంతపురం జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ ఆచార్యులు డి.విష్ణువర్ధన్‌ను పులివెందుల ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా నియమిస్తూ ఉపకులపతి హెచ్.సుదర్శన్‌రావు ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. అదేవిధంగా పలువురు బోధనా సిబ్బందిని బదిలీ సిబ్బందిని బదిలీ చేశారు. ఇందులో ఆర్.పద్మ సువర్ణను స్పాన్సర్డ్ రీసర్చ్ డైరెక్టర్ విభాగం నుంచి ఐక్యూ ఏసి డైరెక్టర్‌గా, బి.ఈశ్వర్‌రెడ్డిని డైరెక్టర్ సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ విభాగం నుంచి స్పాన్సర్డ్ రీసర్చ్ డైరెక్టర్‌గా, అడ్మిషన్ డైరెక్టర్ సురేష్‌బాబును అదనంగా సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ డైరెక్టర్‌గా నియమిస్తూ బదిలీ చేశారు. పులివెందుల కళాశాల ప్రిన్సిపాల్ ఇ.అరుణకాంతిని అనంతపురం జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాలకు బదిలీ చేశారు.

విశ్రాంత పోలీసు ఉద్యోగులను సన్మానిస్తున్న ఎస్పీ జగదీష్, సిబ్బంది

ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి : ఎస్పీ

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

పదవీ విరమణ పొందాక శేష జీవితంలో ఆరోగ్యంపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుని సుఖంగా గడపాలని ఎస్పీ పి.జగదీష్ సూచించారు. పదవీ విరమణ పొందిన అనంతపురం సిసిఎస్ సిఐ నాగమణిని శనివారం స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాలులో సన్మానించారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సమాజం కోసం సిఐ సుదీర్ఘకాలం పాటు సేవలందించి జీవితాలను పునీతం చేసుకున్నారన్నారు. ఈక్రమంలో ఉన్నతాధికారుల ప్రశంసలు పొంది అవార్డులు, రివార్డులు తీసుకోవడం హర్షణీయమన్నారు. విధి నిర్వహణలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని ఉద్యోగ బాధ్యతలను విజయవంతంగా ముగించడం ముదావహమన్నారు. ఈకార్యక్రమంలో ఎఆర్ అదనపు ఎస్పీ ఇలియాజ్‌బాషా, అనంతపురం అర్బన్ డీఎస్పీ వి.శ్రీనివాసరావు, రూరల్ డీఎస్పీ టి.వెంకటేశ్వర్లు, సిఐలు ధరణీకిశోర్, క్రాంతికుమార్, రాజేంద్రనాథ్ యాదవ్, శ్రీకాంత్, శాంతిలాల్, కనుమూరి సాయినాథ్, హేమంత్‌కుమార్, శేఖర్, రఘుప్రసాద్, వెంకటేష్‌నాయక్, ఆర్ఐ రాముడు, పోలీసు డాక్టర్ వెంకటేష్‌ప్రసాద్, ఎస్పీ సిసి ఆంజనేయప్రసాద్, ఆర్ఎస్ఐలు జాఫర్, మగ్బూల్, జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు సాకే త్రిలోక్‌నాథ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జాఫర్, జిల్లా కమిటీ సభ్యులు సుధాకర్‌రెడ్డి, గాండ్ల హరినాథ్, లక్ష్మీనారాయణ, ఆనంద్, జిల్లా పోలీసు కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలందించిన వారికి మెమొంటోలు

పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా అక్టోబర్ 21 నుంచి 31వతేదీ వరకూ చేపట్టిన వివిధ కార్యక్రమాల్లో సేవలు అందించిన పోలీసు అధికారులు, సిబ్బంది, డాక్టర్లు, టీచర్లు, విద్యార్థులకు ఎస్పీ పి.జగదీష్ శనివారం మెమొంటోలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. స్మృతి పరేడ్ నిర్వహణ, ఓపెన్ హౌస్, రక్తదాన శిబిరాలు, ఉచిత మెగా మెడికల్ క్యాంపు, సాంస్కృతిక కార్యక్రమాలు, వ్యాసరచనలు, వక్తృత్వ పోటీలు, యూనిటీ రన్, క్యాండిల్ ర్యాలీ, తదితర కార్యక్రమాలు జిల్లా పోలీసుశాఖ నిర్వహించిన విషయం తెలిసిందే. వీటిల్లో ప్రథమ, ద్వితీయ, తతీయ స్థానాల్లో నిలిచిన వారికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

మద్యం దుకాణాలను నియంత్రించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు వి.సావిత్రమ్మ

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు వి.సావిత్రమ్మ

ప్రజాశక్తి-గుత్తి

రాష్ట్రంలో ఏరులై పారుతోన్న మద్యం దుకాణాలను నియంత్రించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు వి.సావిత్రమ్మ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని జెడ్.వీరారెడ్డి భవన్‌లో సిపిఎం మండల మహాసభ నిర్వహించారు. ముందుగా సిపిఎం జెండాను ఎగురవేశారు. తర్వాత కామ్రేడ్ సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నాయకులు విప్లవ జోహార్లు అర్పించారు. రెండు నిమిషాల పాటు సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వి.సావిత్రమ్మ మాట్లాడుతూ ఆదాయం కోసం రాష్ట్రంలో దాదాపు నాలుగు వేల మద్యం దుకాణాలకు ప్రభుత్వం అనుమతిని ఇచ్చిందన్నారు. ఆ దుకాణాలతో పాటు బెల్టు షాపులు విచ్చలవిడిగా వెలిశాయన్నారు. ప్రజల ప్రాణాలతో ప్రభుత్వం చెలగాటమాడుతోందని విమర్శించారు. ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నిటిని ప్రభుత్వం నెరవేర్చాలన్నారు. అనంతరం నాయకులతో కలిసి భవిష్యత్తు కార్యాచరణ రూపొందించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి బి.రామకృష్ణ, పట్టణ కార్యదర్శి వి.నిర్మల, నాయకులు యు.మల్లికార్జున, ఎం.మల్లేష్, సి.రమేష్, దస్తగిరి, కవిత, రామేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలపై పోరాటాలు

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఓ.నల్లప్ప

ప్రజాశక్తి-పుట్లూరు

రానున్న కాలంలో రైతాంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పోరాటాలు ఉధృతం చేయనున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఓ.నల్లప్ప డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని కడవకల్లు గ్రామంలో సిపిఎం మండల మహాసభ నిర్వహించారు. ముందుగా జెండాను ఎగురవేశారు. అనంతరం గత మూడేళ్లలో సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళనలపై సమీక్ష చేసుకుని భవిష్యత్ కర్తవ్యాలపై తీర్మానాలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో అరటి పంటలకు గిట్టుబాటు ధరతోపాటు మార్కెట్ సౌకర్యం కల్పించాలని, దళారీ వ్యవస్థను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఉపాధి హామీ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేసి వలసలను నివారించాలన్నారు. మండలంలోని చెరువులన్నీటికీ హంద్రీనీవా, తుంగభద్ర నీటితో నింపాలన్నారు. సుబ్బరాయ సాగర్ ప్రాజెక్టు కుడి కాలువ ద్వారా చెరువులను నింపాలన్నారు. అలాగే గ్రామాల్లో మంచినీరు, శ్మశానాలు, కంపచెట్లు తొలగించడం వంటి కనీస మౌలిక సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యల పరిష్కారానికి రానున్న రోజుల్లో ఆందోళనలను తీవ్రతరం చేయనున్నట్లు తెలిపారు. అనంతరం మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా ఎస్.సూరి, కమిటీ సభ్యులుగా నారాయణస్వామి, జె.పెద్దయ్య, ప్రత్యేక ఆహ్వానితులుగా వెంకటచౌదరి, నాగభూషణ, టి.పెద్దయ్య, భాస్కర్‌రెడ్డి, రేవతిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎం.కృష్ణమూర్తి, నాయకులు వెంకటచౌదరి, పెద్దయ్య, నాగభూషణం, భాస్కర్, కుళ్లాయప్ప, జె.పెద్దయ్య, ఆదినారాయణ, యేసురత్నం, నరసింహులు, రామనాథ, సాలమ్మ, తదితరులు పాల్గొన్నారు.

మహాసభలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఓ.నల్లప్ప

కార్మికులకు మెరుగైన వైద్యం అందించాలి

కర్పూరం పరిశ్రమ కార్మికులకు పలువురి పరామర్శ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

చికిత్స పొందుతున్న కార్మికుడిని పరామర్శిస్తున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు

శింగనమల మండల పరిధిలోని లోలూరు వద్ద ఉన్న సప్తగిరి కర్పూరం పరిశ్రమలో విషవాయువుతో అస్వస్థతకు గురైన కార్మికులకు నాణ్యమైన మెరుగైన వైద్యం అందించడంతో పాటు కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు డిమాండ్ చేశారు. సవేరా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కార్మికులను జి.ఓబులు శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరుగురు కార్మికులు అస్వస్థతకు గురై ప్రమాదకర స్థితిలో ఉన్నా యాజమాన్యం బయటికి రాకుండా చేయాలని చూడటం సరికాదన్నారు. కార్మికులు పూర్తిగా కోలుకునేంత వరకూ వేతనంతో కూడిన సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే పరిశ్రమలో కార్మికులకు భద్రత కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వెంకట్‌నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సవేరా ఆసుపత్రిలోని ఐసియులో చికిత్స పొందుతున్న కార్మికులను సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్‌వి.నాయుడు, నగర కార్యదర్శి వెంకట్‌నారాయణ, ముర్తుజా పరామర్శించి.. ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. తర్వాత అక్కడే ఉన్న లేబర్ కమిషనర్, ఆర్‌డిఒ, అడిషనల్ డీఎంహెచ్‌ఒలను కలిసి కార్మికులకు మెరుగైన వైద్యం అందించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ప్రమాదానికి గురైన ఆరుగురు కార్మికుల కుటుంబానికి ఆర్థికసాయం అందజేయడంతోపాటు పూర్తిగా కోలుకునేంత వరకూ వేతనంతో కూడిన సెలవులు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు నాగభూషణం, రామాంజనేయులు, శ్రీనివాసులు, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

శింగనమల : శింగనమల మండలంలోని కర్పూరం ఫ్యాక్టరీలో జరిగిన ఘటనలో అస్వస్థకు గురైన కార్మికులకు మెరుగైన వైద్యం అందించాలని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ శనివారం ఒక ప్రకటనలో ఆదేశించారు. ఫ్యాక్టరీ యాజమాన్యం వైద్యుల సుచనల మేరకు బెంగళూరు, హైదరాబాద్ వంటి నగరాలకు కార్మికులను తరలించి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. అలాగే కార్మికుల కుటుంబాలకు ప్రభుత్వ పరంగా అండగా ఉంటామన్నారు. అలాగే ఫ్యాక్టరీ యాజమాన్యం కూడా కార్మికుల కుటుంబాలకు అన్నివిధాలుగా బాధ్యత వహించాలని సూచించారు.

అనంతపురం సవేరా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కర్పూరం ఫ్యాక్టరీ కార్మికులను టిడిపి సీనియర్ నాయకురాలు బండారు లీలావతి శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా వైద్యుల ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు జిసి.బాబు, చిదంబరి దొర, బండి పరశురాముడు, గుర్రం లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కర్పూరం ఫ్యాక్టరీలో విధులు నిర్వహిస్తూ గ్యాస్ లీకై అస్వస్థతకు గురైన కార్మికులకు మెరుగైన వైద్యం అందించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్ శనివారం ఒక ప్రకటనలో ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. పరిశ్రమలో కార్మికుల అస్వస్థతకు గురికావడం బాధాకరమన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా యాజమాన్యం చర్యలు చేపట్టాలని కోరారు.

గుడిసెలు వేసుకున్న పేదలందరికీ పట్టాలు ఇవ్వాల్సిందే..

సిపిఎం నగర కమిటీ కార్యదర్శి ఆర్‌వి.నాయుడు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

గుడిసెలు వేసుకున్న పేదలందరికి ప్రభుత్వం పట్టాలు ఇవ్వాల్సిందేనని సిపిఎం నగర న్యూ కమిటీ కార్యదర్శి ఆర్‌వి.నాయుడు డిమాండ్ చేశారు. సిపిఎం నగర న్యూ కమిటీ ఆధ్వర్యంలో నగర శివారులోని ఉప్పరపల్లి గ్రామ కంఠం పొలం 194/8 సర్వేనెంబర్‌లో పేదలు, దళితులు, గిరిజనులు వేసుకున్న గుడిసెలను రెవెన్యూ అధికారులు తొలగించేందుకు యత్నించారు. దీంతో సిపిఎం నాయకులతోపాటు కాలనీవాసులు అధికారులను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆర్‌వి.నాయుడు మాట్లాడుతూ పేదలు రెండేళ్లుగా గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్నారన్నారు. వీరందరికీ పట్టాలు ఇవ్వాలని ఇప్పటికే తహశీల్దార్, కలెక్టర్, ఆర్‌డిఒల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గుడిసెలు వేసుకున్న పేదలందరికీ పట్టాలు ఇవ్వాలని, లేనిపక్షంలో సోమవారం కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు.

రెవెన్యూ సిబ్బందితో వాదిస్తున్న మహిళలు

ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

విద్యార్థుల ఆకలికేకలు పట్టవా..

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన

ప్రజాశక్తి-నార్పల

జూనియర్ కళాశాలల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థుల ఆకలికేకలు ప్రభుత్వానికి పట్టడం లేదని ఎస్ఎఫ్ఐ నాయకులు ఆరోపించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సిద్ధార్థ్, జిల్లా ఉపాధ్యక్షులు తరిమల గిరి, జిల్లా సహాయ కార్యదర్శి రాచేపల్లి సూర్యప్రకాష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు సోము మాట్లాడుతూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చేపట్టిన యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం పథకాన్ని ప్రారంభించాలన్నారు. అలాగే పెండింగ్ ఉన్న వసతిదీవెన, విద్యాదీవెన, ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 6వ తేదీన చలో కలెక్టరేట్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు జయకృష్ణ, రహీంసాయి, జాన్సన్, టోనీ, విగ్నేష్ హర్ష, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థానాలను అధిరోహించాలి

ఎస్పీ పి.జగదీష్

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

బాగా చదివి ఉన్నత స్థానాలు అధిరోహించాలని ఎస్పీ పి.జగదీష్ పిలుపునిచ్చారు. జిల్లాకు చెందిన హోంగార్డుల పిల్లల చదువులను ప్రోత్సహిస్తూ ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు శనివారం స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాలులో ప్రతిభా పురస్కారాలు (మెరిట్ స్కాలర్ షిప్పులను) అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ తల్లిదండ్రుల పెంపకం, సహవాసంతో క్యారెక్టర్ నిర్ధుష్టమవుతుంది. ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్తే ఏదీ అసాధ్యం కాదన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో మంచి, చెడులు పక్కపక్కనే ఉంటాయన్నారు. అయితే వాటిని ఎంచుకోవడంలోనే భవిష్యత్తు ఆధారపడి ఉంటుందన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, బిటెక్, ఎంసిఎ, తదితర చదువుల్లో రాణించిన హోంగార్డుల పిల్లలు ఒక్కొక్కరికి రూ.2వేల నుంచి రూ.10వేల వరకూ 50 మంది పిల్లలకు అందజేశారు. ఈకార్యక్రమంలో ఎఆర్ అడిషనల్ ఎస్పీ ఇలియాజ్ బాషా, అనంతపురం అర్బన్ డిఎస్పీ వి.శ్రీనివాసరావు, రూరల్ డిఎస్పీ టి.వెంకటేశ్వర్లు, సిఐలు ధరణికిశోర్, క్రాంతికుమార్, రాజేంద్రనాథ్‌యాదవ్, శ్రీకాంత్, శాంతిలాల్, కనుమూరి సాయినాథ్, హేమంత్‌కుమార్, శేఖర్, రఘుప్రసాద్, వెంకటేష్‌నాయక్, ఆర్‌ఐ రాముడు, పోలీసు డాక్టర్ వెంకటేష్‌ప్రసాద్ , ఎస్బీ సిసి ఆంజనేయప్రసాద్, ఆర్‌ఎస్‌ఐలు జాఫర్, మగ్బూల్, జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు సాకే త్రిలోక్‌నాథ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జాఫర్, జిల్లా కమిటీ సభ్యులు సుధాకర్‌రెడ్డి, గాంధీ, హరినాథ్, తేజపాల్, లక్ష్మీనారాయణ, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న ఎస్పీ పి.జగదీష్

పెద్దపప్పూరును కరువు మండలంగా ప్రకటించాలని వినతి

పెద్దపప్పూరు : జిల్లాలో అత్యంత వెనుకబడిన పెద్దపప్పూరు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం స్థానిక కార్యాలయంలో తహశీల్దార్‌కు కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ ఈఏడాది మండల వ్యాప్తంగా అత్యంత తక్కువ వర్షపాతం నమోదైందన్నారు. దీంతో పనులు లేక కూలీలు, రైతులు వలసలు వెళ్తున్నారన్నారు. వలసలు వెళ్తున్న క్రమంలో ఆటోలు, ప్రయివేటు వాహనాల్లో వెళ్తూ ప్రమాదాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కావున వెంటనే ఉన్నతాధికారులు స్పందించి పెద్దపప్పూరును కరువు మండలంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రానున్న రోజుల్లో తహశీల్దార్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు కుళ్లాయప్ప, చెన్నారెడ్డి, ఆదినారాయణ, చలపతి, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే చర్యలు

గుంతకల్లు : ప్రజల సౌకర్యార్థం గుడి, బడి, వైద్యశాల ఏర్పాటుకు ఏర్పాటు చేసిన రిజర్వు స్థలాల్లో అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవనిమున్సిపల్ కమిషనర్ నయీమ్‌అహ్మద్, టిపిఒ అబ్దుల్ సత్తార్ హెచ్చరించారు. శనివారం పట్టణంలోని సోనియా గాంధీకాలనీలో అక్రమంగా బండలతో ఏర్పాటు చేస్తున్న నిర్మాణాలను మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు తొలగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని ఎక్కడైనా ప్రభుత్వ స్థల్లాల్లో నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవన్నారు. మున్సిపల్ చట్ట ప్రకారం శిక్షార్హులు అవుతారన్నారు. స్థానిక సోనియాగాంధీ కాలనీలో కొందరు మున్సిపల్ రిజర్వుడ్ స్థలాన్ని ఆక్రమించుకుని నిర్మాణం చేపడితే తమకు అందిన సమాచారం మేరకు వెంటనే టౌన్ ప్లానింగ్ సిబ్బందిని పంపి అక్రమ కట్టడాన్ని తొలగించామన్నారు. ప్రజల ఉపయోగార్థం ఏర్పాటు చేసిన రిజర్వుడు స్థలాల్లో ఎవరు కూడా అక్రమ నిర్మాణాలు చేపట్టరాదన్నారు.మున్సిపల్ రిజల్ట్ స్థలాలలో అక్రమ నిర్మాణాలు చేపడితే ఎవరైనా ఉపేక్షించేది లేదన్నారు.

వర్గీకరణ సాధన ఎంఆర్‌పిఎస్ఎస్ కమిటీ సభ్యులు

వర్గీకరణ అమలు చేసేంత వరకూ పోరాటం

అనంతపురం కలెక్టరేట్ : ఎస్సీ వర్గీకరణ సాధించేంత వరకూ పోరాటం కొనసాగుతుందని ఎంఆర్‌పిఎస్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు బుంగ సంజయ్‌మాదిగ స్పష్టం చేశారు. శనివారం ఎమ్మార్పీఎస్ఎస్ ఆధ్వర్యంలో ఉమ్మడి అనంతపురం జిల్లా మాదిగల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదిగల ఏకైక లక్ష్యం ఎస్సీ వర్గీకరణ ఒక్కటే అన్నారు. వర్గీకరణ సాధన కోసం కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఎంఆర్‌పిఎస్ఎస్ జిల్లా గౌరవాధ్యక్షులుగా ఎస్.దస్తగిరి, కె.ఉమేష్, గౌరవ సలహాదారులుగా కె.తిరుమలేసు, కె.మధు, జిల్లా అధ్యక్షుడిగా కె.చలపతిమాదిగ, జిల్లా ఉపాధ్యక్షుడిగా కె.సుధాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎస్.రాజశేఖర్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎంఆర్‌పిఎస్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ టిఎం.రమేష్‌మాదిగ, తదితరులు పాల్గొన్నారు.

అండర్-19 క్రికెట్ జట్టుకు తాడిపత్రి క్రీడాకారుడు

జయంత్‌కృష్ణ

తాడిపత్రి : తాడిపత్రికి చెందిన అధికారి జయంత్ కృష్ణ అండర్-19 రాష్ట్రస్థాయి క్రికెట్ జట్టుకు ఎంపికైనట్లు ఆర్డీటీ కోచ్ భార్గవ్ తెలిపారు. జయంత్ కృష్ణ నవంబర్ 6 నుంచి మంగళగిరిలో జరిగే కూచ్ బీహార్ ట్రోఫీలో పాల్గొంటారన్నారు. తాడిపత్రి ఆర్డీటీ క్రికెట్ కోచింగ్ క్యాంపు నుంచి రాష్ట్ర జట్టుకు క్రీడాకారుడు ఎంపికపై ఎటిఎల్ లలిత, సీనియర్ కోచ్ సాదిక్‌వలి, సీనియర్ క్రీడాకారులు భార్గవ్ హర్షం వ్యక్తం చేశారు.

రైఫిల్ షూటింగ్‌లో సత్తాచాటిన విద్యార్థులకు అభినందన

ధాత్రీశివానీ, తీక్షణ్‌సాయిని అభినందిస్తున్న డిఇఒ

అనంతపురం : రాజమండ్రిలో జరిగిన 68వ స్కూల్ గేమ్స్ రైఫిల్ షూటింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన అనంతపురం విద్యార్థులను డిఇఒ ప్రసాద్‌బాబు శనివారం అభినందించారు. అండర్-14 బాలికల పిస్టల్ విభాగంలో ధాత్రీశివాని, ఓపెన్ సైట్ రైఫిల్ బాలుర విభాగంలో తీక్షణ్‌సాయి 3వ స్థానాల్లో నిలిచి బ్రాంజ్ మెడల్ సాధించారు. అలాగే అండర్-17 బాలిక విభాగంలో గురు ప్రవల్లిక, అండర్ 19 బాలిక విభాగంలో మల్లికాబాయి, అండర్ 19 బాలుర విభాగంలో అఖిల్ బ్రాంజ్ మెడల్ సాధించారన్నారు. వీరి డిసెంబర్ 24 భోపాల్ జరగబోయే నేషనల్ పోటీలకు ఎంపికైనటుక్ల కోచ్ శ్రీకాంత్ తెలిపారు.

నేడు 'టేస్ట్ ఆఫ్ పులావ్ స్' ప్రారంభం

ప్రారంభించనున్న హీరో శ్రీకాంత్

ప్రజాశక్తి-అనంతపురం

శ్రీకాంత్ ప్రారంభించనున్న రెస్టారెంట్

నగరంలోని రైల్వేస్టేషన్ సమీపంలో నూతనంగా నిర్మించిన శ్రేయాస్ గ్రాండ్ హోటల్‌లో ఏర్పాటు చేసిన 'టేస్ట్ ఆఫ్ పులావ్ స్' వెజ్ అండ్ నాన్‌వెజ్ రెస్టారెంట్లను ప్రముఖ హీరో శ్రీకాంత్ ఆదివారం ప్రారంభించనున్నట్లు మేనేజింగ్ డైరెక్టర్ లక్ష్మీకాంత్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను ఇప్పటికే పూర్తి చేసినట్లు తెలిపారు.

మత్తు పదార్థాలపై అవగాహన

యాడికి : మండల పరిధిలోని రాయలచెరువు జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో మత్తు పదార్థాలు, పొగాకు వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు డేనియల్, హెడ్ కానిస్టేబుల్ సాంబశివరావు ధూమపానం, మద్యపానం, పదార్థాల వాడకం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సంధ్యారాణి, హెల్త్ విభాగం షబ్బీర్‌అహ్మద్. ఎఎన్ఎం శోభారాణి, ఆశా కార్యకర్త ఆశాబీ, తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి నాటికి గుంతలు లేని రహదారులు

ప్రజాశక్తి-రాయదుర్గం

వచ్చే సంక్రాంతి నాటికి గుంతలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తెలిపారు. శనివారం పట్టణంలోని ఆంజనేయ స్వామి ఆలయం సమీపంలో రోడ్డుపై గుంతలు పూడ్చే కార్యక్రమాన్ని భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా వచ్చే సంక్రాంతి నాటికి రోడ్లపై గుంతలు లేకుండా చేస్తామన్నారు. అలాగే పట్టణంలో రెండు రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులను కూడా త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. రాయదుర్గం పట్టణాన్ని అన్నివిధాల అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పురపాలక సంఘం అధ్యక్షులు పొరాలు శిల్ప, వార్డు సభ్యులు గోవిందరాజులు శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, ఎఇలు నరసింహులు, కోదండ, టిడిపి నాయకులు నాగరాజు, హనుమంతు, పురుషోత్తం, సంపత్ కుమారి, హనుమంతురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లు : గుంతులు లేని రాష్ట్రమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ అన్నారు. శనివారం పట్టణంలోని కసాపురం రోడ్డులో ఉన్న అయ్యప్పస్వామి ఆలయం ఎదురుగా గుంతలమయమైన రహదారి మరమ్మతులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా డిఎల్‌డిఒ విజయలక్ష్మి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం హాయంలో రాష్ట్రంలోని రహదారులన్నీ గుంతలమయమై వాహనదారులు ప్రమాదాలకు గురై ప్రాణాలు పోగొట్టుకున్నారన్నారు. అయితే సిఎం చంద్రబాబు సారథ్యంలో కూటమి ప్రభుత్వం రోడ్లలో ఏర్పడిన గుంతలను పూడ్చివేసేందుకు శ్రీకారం చుట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రమాదేవి, ఆర్‌అండ్‌బి ఎఇఇ లక్ష్మీదేవి, వార్డు కౌన్సిలర్ ప్రభాకర్, టిడిపి పట్టణ అధ్యక్షుడు బండారు ఆనంద్, నాయకులు నారాయణస్వామి, మాజీ మార్కెట్ యార్డు ఛైర్మన్ గుమ్మానూరు వెంకటేసులు, నాయకులు పాల్గొన్నారు.

యాడికి : నియోజకవర్గ పరిధిలోని పెద్దపప్పూరు మండలం కేంద్రం నుంచి పెద్దయక్కలూరు, యాడికి మండలంలోని నగరూరు పరిసర ప్రాంతాల రోడ్ల మరమ్మతులకు మాజీ ఎంపిపి వేలూరు రంగయ్య శనివారం భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో క్లాస్ 1 కాంట్రాక్టర్ చవ్వా గోపాల్‌రెడ్డి, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సత్యనారాయణ, టిడిపి ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు గండికోట లక్ష్మణ్. యాడికి మండల టిడిపి నాయకులు నగురూరు నర్సింహులు.

గుంతకల్లులో పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్

గుంతలు పూడ్చే కార్యక్రమాలకు భూమిపూజ

రాయదుర్గంలో పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

తిరునాథరెడ్డి, వెంకటచౌదరి, రవికుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం కలెక్టరేట్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గుంతలు పడ్డ రహదారులను పూడ్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నిధులు విడుదల చేయడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని నియోజకవర్గ టిడిపి నాయకులు అన్నారు. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆదేశాలతో రుద్రంపేటలో రోడ్లపై ఉన్న గంతలను పూడ్చి వేసే కార్యక్రమాన్ని టిడిపి రాష్ట్ర నాయకుడు గంగారామ్, రుద్రంపేట టిడిపి నాయకులు శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, రుద్రంపేట టిడిపి నాయకులు భక్తవత్సలం నాయుడు, ఈడిగ నాగభూషణం, బోయపాటి బాలప్ప, రుద్రంపేట టిడిపి అధ్యక్షుడు ఎస్ఎం.బాషా, కరణం ప్రతాప్ టిడిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్ : గుంతల రహిత ఆంధ్రప్రదేశ్ తమ లక్ష్యమని టిడిపి సీనియర్ నాయకులు మోరేపల్లి మల్లికార్జున అన్నారు. శనివారం పట్టణంలోని హిందూపురం రోడ్డులో 'గుంతల రహిత ఆంధ్రప్రదేశ్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎక్కడా గుంతల రోడ్లు లేకుండా చేయడమే ఎమెమ్మ్ల్యే అమిలినేని సురేంద్రబాబు, కూటమి ప్రభుత్వం లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌అండ్‌బి డిఇ ప్రసాద్, ఎఇఇలు, టిడిపి మండల కన్వీనర్ గోళ్ల వెంకటేశులు, పట్టణ కన్వీనర్ శర్మాస్‌వలి, మాజీ కన్వీనర్ డిష్ మురళి, మాజీ మార్కెట్ యార్డు ఛైర్మన్ పాపంపల్లి రామాంజినేయులు, మాజీ కన్వీనర్ డీకే రామాంజినేయులు, మాజీ మున్సిపల్ వైస్‌ఛైర్మన్‌లు అబ్దుల్ రహీం, శ్రీనివాసరెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి ఒంటిమిద్ది తలారి సత్తి, మాజీ జడ్పీటీసీ కొల్లాపురప్ప, నాయకులు షామీర్, రమేష్, సునీల్, మంజునాథ్‌రెడ్డి, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

రాప్తాడు : మండల కేంద్రంలో గుంతలు లేని రోడ్ల కార్యక్రమానికి టిడిపి నాయకులు శనివారం శ్రీకారం చుట్టారు ఇందులో భాగంగా రాప్తాడు కోటవీధి కాలనీలో రోడ్ల మరమ్మతులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వచ్చే సంక్రాంతి నాటికి గుంతలు లేని మండలంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామన్నారు.

ఘనంగా డివైఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి-గుంతకల్లు

జెండాను ఎగురవేస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

పట్టణంలోని సిఐటియు కాలనీలో డివైఎఫ్ఐ పట్టణ ప్రధాన కార్యదర్శి సురేంద్రబాబు, మాజీ నాయకులు మారుతీప్రసాద్ ఆధ్వర్యంలో ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా జెండాను ఎగురవేశారు. అనంతరం వారు మాట్లాడుతూ 1980లో పంజాబ్ రాష్ట్రంలోని లూథియానా నగరంలో 'అందరికీ విద్య - ఉపాధి' అనే నినాదంతో ఆర్థిక, సామాజిక,లింగ వివక్షతలకు వ్యతిరేకంగా స్వాతంత్ర సమరయోధుల స్ఫూర్తితో పని చేయాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్యను ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. నాటి నుంచి నేటి వరకూ అనేక ఉద్యమాలు, పోరాటాలు చేశామన్నారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ప్రజలపై వేస్తున్న భారాలకు వ్యతిరేకంగా, యువతకు ఉపాధి లేకుండా తక్కువ వేతనానికే ఎక్కువ పని చేయించుకునే దుర్మార్గానికి వ్యతిరేకంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు రాము, పరశురాం, అబ్దుల్లా, ఓబులేసు మరియు కాలనీలోని యువతి యువకులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

బుక్కరాయసముద్రం : వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్యసేవలు అందించాలని ఎంపిపి దాసరి సునీత సూచించారు. శనివారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆసుపత్రి అభివృద్ధి సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆసుపత్రిలో మౌలిక వసతులు, శానిటేషన్, ఎలక్ట్రికల్, నేషనల్ క్వాలిటీ అసూరెన్స్ గ్యాప్స్ లేకుండా చేయాలని, వివిధ పనుల కోసం ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ వైద్యులతోపాటు సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు, పసులూరు సర్పంచి కల్పలతారెడ్డి, మన్నేరు కొండమ్మ పరమేష్, వైద్యాధికారి డాక్టర్ స్వాతి, మండల్ డెవలప్‌మెంట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ హనుమంతురెడ్డి, పిహెచ్ఎన్ చెన్నమ్మ, నాగలక్ష్మమ్మ, హెల్త్ ఎడ్యుకేటర్ ఫాతిమా, ఫార్మాసిస్ట్ మహబూబ్‌బాషా, సీనియర్ అసిస్టెంట్ సునీత, సూపర్‌వైజర్ సత్యనారాయణ, ఆయూష్ కాంపౌండర్ నళిని పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు

గుండిగానిపల్లిలో హౌసింగ్ పీడీ పర్యటన

కాలనీవాసులతో మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ

బ్రహ్మసముద్రం : మండలంలోని గుండిగానిపల్లి ఎస్సీ కాలనీలో హౌసింగ్ పీడీ శైలజ శనివారం పర్యటించారు. గతనెల 15న వేపులపర్తిలో నిర్వహించిన పల్లె పండుగ కార్యక్రమానికి హాజరైన కలెక్టర్‌కు గుండిగానిపల్లి ఎస్సీ కాలనీవాసులు పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈనేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు మండల హౌసింగ్ అధికారి రామ్మోహన్, వర్క్ ఇన్స్‌పెక్టర్ యుగంధర్‌తో కలిసి హౌసింగ్ పీడీ శైలజా కాలనీలో పర్యటించి ప్రజలను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిర్మించుకున్న ఇళ్లు కావడంతో వర్షం వస్తే నీరు ఇళ్లలోకి వస్తోందని వాపోయారు. ఇందుకు పీడీ స్పందిస్తూ ఉన్నతాధికారులతో మాట్లాడి ఎన్టీఆర్ ఇళ్లు మంజూరుకు ప్రతిపాదనలు పంపుతామని వివరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ నాగిరెడ్డి, తెలుగు యువత అధ్యక్షుడు నీలాస్వామి, బజ్జన్నగౌడ, కురుమల్లి, ఎస్సీ కాలనీవాసులు పాల్గొన్నారు.

బొప్పేపల్లిలో కార్డెన్‌సెర్చ్

బొప్పేపల్లిలో పర్యటిస్తున్న పోలీసులు

యల్లనూరు : ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు సిఐ సత్యబాబు ఆధ్వర్యంలో శనివారం మండల పరిధిలోని బొప్పేపల్లి గ్రామంలో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఇందులో భాగంగా ఎస్ఐ శ్రీరామప్రసాద్ పోలీసు సిబ్బందితో కలిసి ట్రబుల్ మాంగర్స్, రౌడీషాటర్లు, అనుమానం ఉన్న వ్యక్తుల ఇళ్లల్లో క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. అనంతరం సిఐ మాట్లాడుతూ శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. గొడవలకు దూరంగా ఉంటూ ప్రశాంత జీవనం సాగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జమేదారు శంకర్‌నారాయణ, పోలీసులు రవీంద్రారెడ్డి, బాలరాజు, కృపాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

మాట్లాడుతున్న సాంబశివారెడ్డి

శింగనమల : పార్టీ కోసం పని చేసిన ప్రతి కార్యకర్త, నాయకుడికీ అండగా ఉంటామని వైసిపి నాయకులు ఆలూరు సాంబ శివారెడ్డి భరోసా ఇచ్చారు. కొద్ది నెలల క్రితం మండలంలోని నిదనవాడ గ్రామంలో ఎంపిటిసి సునీతమ్మ భర్త వైసిపి నాయకుడు ఎం.రామాంజనేయులు మృతిచెందిన విషయం తెలిసిందేన. విషయం తెలుసుకున్న సాంబశివారెడ్డి గ్రామానికి చేరుకుని బాధిత కుటుంబానికి శనివారం తనవంతుగా రూ.లక్ష ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో ప్రెసిడెంట్ బొమ్మన శ్రీరామిరెడ్డి, శేఖర్‌రెడ్డి, అమర్నాథ్‌రెడ్డి, నారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పొలాల పరిశీలన

యల్లనూరు : ఎపిఎంఐపి డ్రిప్ ఇరిగేషన్ ప్రాజెక్టు ద్వారా డ్రిప్ పరికరాల కోసం దరఖాస్తు చేసుకున్న రైతుల పొలాలను ఎపిఎంఐపి ప్రాజెక్టు డైరెక్టర్ రఘునాథ్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఇందులో భాగంగా ఆయా రైతుల పొలాల్లో బోర్లను పరిశీలించి డ్రిప్ పరికరాల ఆవశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమంలో కొఠారి డ్రిప్ డిస్ట్రిబ్యూటర్ రాజశేఖరనాయుడు, రైతులు పాల్గొన్నారు.

కళాశాలల్లో 'మధ్యాహ్న భోజనం' అమలు చేయాలి

రాయదుర్గం : రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని ఎఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం ముందు ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హనుమంతరాయుడు, కుళ్లాయిస్వామి మాట్లాడుతూ గతంలో టిడిపి ప్రభుత్వ అధికారంలో జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేసేవారన్నారు. అయితే వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎత్తివేసిందన్నారు. తిరిగి టిడిపి అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో జూనియర్ కళాశాలల్లో కూడా తిరిగి మధ్యాహ్న భోజనం అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి ఆంజనేయులు, ఉపాధ్యక్షులు వంశీ, కార్యవర్గ సభ్యులు పవన్, నియోజకవర్గ అధ్యక్షులు శశి, రాజేష్, మధు మనోజ్ పాల్గొన్నారు.

5న డయల్ యువర్ డిఎం

రాయదుర్గం : ఈనెల 5వ తేదీన సాయంత్రం 4-30 నుంచి 5-30 గంటల వరకూ డయల్ యువర్ డిఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ కె.సురేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీ సేవలకు సంబంధించి ప్రజలు, ప్రయాణికులు ఫోన్ 99592 25863 నెంబర్‌కు ఫోన్ చేసి సమస్యలను తెలపవచ్చన్నారు.

7న ఉచిత గుండె వైద్యశిబిరం

గుత్తి : పట్టణంలోని అనంతపురం రోడ్డులో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎదురుగా ఉన్న జ్యోతి ప్రథమ చికిత్స కేంద్రం వైద్యులు వి.నాగేంద్ర ఆధ్వర్యంలో ఈనెల 7న ఉచిత గుండె వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో అనంతపురంలోని మార్క్ సూపర్ స్పెషాలిటీ గుండె ఆసుపత్రి వైద్య నిపుణులు పాల్గొని ఉచితంగా బ్లడ్ షుగర్, బిపి, ఈసీజీ, 2డి ఎ పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఈ అవకాశాన్ని ప్రజల సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఫైర్‌స్టేషన్ స్థలానికి కంచె వేయాలని వినతి

గుత్తి : పట్టణంలోని అగ్నిమాపక కేంద్రానికి కేటాయించిన స్థలం కబ్జాకు గురి కాకుండా కంచె ఏర్పాటు చేయాలని వైసిపి ఐటీ విభాగం ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ బి.జబ్బర్ మియాకు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వైసిపి ఐటి విభాగం జిల్లా అధ్యక్షుడు వై.రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుకు మార్కెట్ యార్డు ఎదురుగా రెవెన్యూ అధికారులు స్థలాన్ని కేటాయించారని చెప్పారు. జిల్లా అగ్నిమాపక కేంద్రాధికారి ఫైర్ స్టేషన్ ఏర్పాటుకు అనుమతులు కూడా ఇచ్చారన్నారు. ఆ స్థలం ఆక్రమణకు గురికాకుండా కంచె వేయాలని కోరారు.

టీచర్ల సీనియారిటీలో లోపాలు సరిచేయాలి

అనంతపురం కలెక్టరేట్ : మున్సిపల్ టీచర్ల ప్రమోషన్ల ప్రక్రియలో భాగంగా సీనియారిటీ, ఖాళీల్లో నెలకొన్న అసంబద్ధాలను తొలగించాలని ఎస్‌టియు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమణారెడ్డి, రామాంజనేయులు కోరారు. ఈమేరకు శనివారం జిల్లాకేంద్రంలో జిల్లా విద్యాశాఖ కార్యాలయ సూపరింటెండెంట్ ఆదినారాయణకి వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఎస్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్యుడు, సీనియర్ నాయకులు అజయ్‌కుమార్, జిల్లా కార్యదర్శి మల్లికార్జున, నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రభాకర్, సురేష్‌కుమార్, నగర నాయకులు రాజన్న, రమేష్, రామకృష్ణ, మల్లికార్జున, నరసింహులు, సత్యజిల్లా నాయకులు సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న సర్పంచి మహదేవమ్మ, రీజనల్ డైరెక్టర్ సుబ్బారావు

వాటర్‌ప్లాంట్ ప్రారంభం

కుందుర్పి : మండలంలోని ఎనుములదొడ్డిలో ఏర్పాటు చేసిన ఆర్డీటీ వాటర్‌ప్లాంట్‌ను సర్పంచి సర్పంచి మహదేవమ్మ, ఆర్డీటీ రీజనల్ డైరెక్టర్ సుబ్బారావు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎనుములదొడ్డి పంచాయతీలో రూ.14లక్షలు వెచ్చించి శుద్ధినీరు అందించేందుకు కృషి చేసిన ఆర్డీటీ సంస్థకు రుణపడి ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి తిప్పేస్వామి, ఎటిఎల్ నారాయణస్వామి, సర్పంచి తనయుడు విజయ్‌కుమార్, టిడిపి సీనియర్ నాయకుడు శేఖర్‌గౌడ్, కెఎల్.ప్రసాద్, బొమ్మలింగ, ఆనంద్, తిప్పేస్వామి, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయాలి

ప్రజాశక్తి-ఉరవకొండ

విద్య హక్కు చట్టం ప్రకారం ప్రయివేట్ పాఠశాలల్లో 25శాతం ఉచిత విద్యను అందించాలని జివిఎస్ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సాకే పురుషోత్తం, ఆర్ఎస్‌యు జిల్లా ప్రధాన కార్యదర్శి చిరంజీవి డిమాండ్ చేశారు. ఈమేరకు జివిఎస్ఎస్, ఆర్ఎస్‌యు విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలో మండల విద్యాశాఖ అధికారి ఈశ్వరప్పకు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యాహక్కు చట్టం ప్రకారం 25శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పేద విద్యార్థులకు ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలల్లో ఉచిత విద్యను అందించాలన్నారు. అయితే ఎక్కడా అమలు కావడం లేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయాలని, లేనిపక్షంలో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో విద్యార్థి సంఘం నాయకులు వంశీ, తదితరులు పాల్గొన్నారు.

ఎంఇఒకు వినతిపత్రం అందజేస్తున్న జివిఎస్ఎస్ నాయకులు

ఆటోడ్రైవర్‌కు సన్మానం

గుత్తి : పట్టణంలోని గాంధీనగర్ కు చెందిన ఆటోడ్రైవర్ షేక్‌నజీర్‌ను శనివారం గుత్తిలో పలువురు సన్మానం చేశారు. నజీర్ తన ఆటోలో గర్భిణులను చికిత్స కోసం ఉచితంగా ఆసుపత్రులకు తరలిస్తున్నారు. అలాగే తోటి ఆటో డ్రైవర్లతో కలిసి తమ ఆటోల్లో ఎర్ర మట్టిని తెచ్చి రహదారులపై ఉన్న గుంతలను పూడ్చుతున్నారు. అతను చేసిన వివిధ సేవా కార్యక్రమాలను గుర్తించి గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు సి.విజయభాస్కర్, జెమిని ఎలక్ట్రానిక్స్ యజమాని కెఇ.సురేష్‌గౌడ్, తదితరులు నజీర్ కు శాలువా, పూలమాలతో సత్కరించారు.

అభివృద్ధి పనుల పరిశీలన

అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎంపిడిఒ

యల్లనూరు : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా మండల పరిధిలోని జంగంపల్లి గ్రామంలో చేపట్టిన పశువుల షెడ్ల నిర్మాణాలను ఎంపిడిఒ వాసుదేవరెడ్డి శనివారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ షబ్బీర్, ఫీల్డ్ అసిస్టెంట్ దివాకర్‌నాయుడు పాల్గొన్నారు.

మద్యం పట్టివేత

యల్లనూరు : అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని పట్టుకున్నట్లు ఎస్ఐ శ్రీరామప్రసాద్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. మండల కేంద్రంలోని మద్యం షాపు నుంచి సింగవరం గ్రామానికి చెందిన రామాంజనేయులు, దంతలపల్లి గ్రామానికి చెందిన నాగరాజు మద్యాన్ని తీసుకెళ్తుండగా దాడి చేసి పట్టుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ముగ్గురి బైండోవర్

అక్రమ మద్యం కేసులో ఉన్న ముగ్గురు వ్యక్తులను శనివారం బైండోవర్ చేసినట్లు ఎస్ఐ శ్రీరామప్రసాద్ తెలిపారు. ఇందులో భాగంగా మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్ రాజా ముందు హాజరు పరిచి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గుణాత్మక విద్యనందించాలి

ప్రజాశక్తి-ఉరవకొండ

విద్యార్థులకు సంపూర్ణ ఆరోగ్యంతోపాటు గుణాత్మకమైన విద్యను అందించాలని ఎంపిపి నరసింహులు సూచించారు. శనివారం ఉరవకొండలోని అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలను ఎంపిపితోపాటుఉరవకొండ డివిజన్ మలేరియా సబ్‌యూనిట్ అధికారి భక్తుల కోదండరామిరెడ్డి, ఇఒఆర్‌డి గౌస్‌సాహెబ్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ టెన్త్, ఇంటర్ పరీక్షల్లో ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించేలా ప్రణాళికలు రూపొందించుకుని ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని పాఠశాల సిబ్బందికి సూచించారు. అలాగే వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను కూడా పరిశుభ్రత పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ప్రసూన, విద్యాకమిటీ ఛైర్‌పర్సన్ పుష్పావతి, వైస్‌ఛైర్మన్ ముండ్ల చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎంపిపి నరసింహులు, అధికారులు

టిడిపి సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి-అనంతపురం

ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్ ఆదేశాల మేరకు శనివారం నగరంలోని 42వ డివిజన్ పరిధిలో టిడిపి సభ్యత్వ నమోదు చేపట్టారు. ఇందులో భాగంగా పలువురు కార్యకర్తలతో పార్టీ సభ్యత్వ నమోదు చేయించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి సంగా తేజస్విని, నగర మైనారిటీ ప్రధాన కార్యదర్శి దాదు, డివిజన్ నాయకులు సంగా పవన్ కుమార్, జ్యోతి, శ్యామ్, తదితరుల పాల్గొన్నారు..

అనంతపురంలో సభ్యత్వ నమోదు చేస్తున్న టిడిపి నాయకులు

పుట్లూరు మండలంలో సభ్యత్వ నమోదు చేస్తున్న టిడిపి నాయకులు

పుట్లూరు : మండలంలోని కడవకల్లు గ్రామంలో శనివారం టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆ పార్టీ నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు గోవర్ధనరాజు టిడిపి సభ్యత్వం తీసుకున్న కార్యకర్తలకు అనేక ప్రయోజనాలు ఉన్నాయన్నారు. కార్యకర్తలు ఎవరైనా సహజ మరణమైతే రూ.2లక్షలు, ప్రమాదవశాత్తు చనిపోతే రూ.5లక్షల బీమా వర్తింపజేయనున్నట్లు తెలిపారు.

నూతన రథం తయారీ పనుల పరిశీలన

ప్రజాశక్తి-ఉరవకొండ

మండల పరిధిలోని పెన్నఅహోబిలంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో చేపట్టిన నూతన రథం నిర్మాణ పనులను కర్నూలు జోన్ దేవాదాయ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాసప్రసాద్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో రథం తయారు చేసే పనులపై అసంతృప్తిని వ్యక్తం చేశారు. వందల సంవత్సరాలపాటు ఉండే రథంపైన లక్షలాది మంది భక్తుల మనోభావాలు ముడిపడి ఉన్నాయన్నారు. కావున నిష్ణాతులతో నూతన రథాన్ని తయారు చేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టర్ గౌతమరెడ్డి, ఆలయ కార్యనిర్వాహాధికారి రమేష్‌బాబు, అర్చకులు ద్వారకానాథ చార్యులు, భారత చైతన్య యువజన పార్టీ ఉరవకొండ ఇన్‌ఛార్జి బెస్త పవన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రథం పనులను పరిశీలిస్తున్న కర్నూలు జోన్ దేవాదాయ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసప్రసాద్

సచివాలయం తనిఖీ

రికార్డులను పరిశీలిస్తున్న కమిషనర్

గుత్తి : మున్సిపాలిటీ పరిధిలోని 9వ సచివాలయాన్ని మున్సిపల్ కమిషనర్ బి.జబ్బార్‌మియా శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా బయోమెట్రిక్ అటెండెన్స్, మూమెంట్ రిజిస్టర్, వర్క్ డన్ రిజిస్టర్లను పరిశీలించారు. 2024-25 సంవత్సరానికి సంబంధించి ఆస్తి పన్నులను 100 శాతం వసూలు చేయాలని సూచించారు. సామాజిక పింఛన్లను 99.20 శాతం లబ్ధిదారులకు పంపిణీ చేశామని చెప్పారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.